# 'ఆశా నా ఆధారరేఖ' ని ఆలంబనగా మిగిల్చిన ఇందిరగారి కవిత

- నారాయణస్వామి

ఇందిరగారి కవిత్వం చదివాక మనం ఒక మంచి కవినీ, ఒక అద్భుతమైన భావుకురాలినీ మాత్రమే కాదు - మనకీ మధ్య అరుదుగా కనబడే సామాజిక స్పృహగల ఒక మంచి వ్యక్తిత్వాన్ని కోల్పోయామే అని ఎంతో బాధేస్తుంది. హృదయంలో ఏదో ఒక శూన్యం. గుండె గొంతుకలో అడ్డం పడుతుంది. ఎంత చక్కగా రాసింది కొన్ని కవితలు! కొన్ని మ్యూజింగ్స్ (చలంగారే గుర్తు కొస్తారు) !! గొప్ప సృజనాత్మకత, భావుకత, sentitivity మాత్రమే కాదు తనలో సామాజిక బాధ్యత అణువణువూ కనిపిస్తుంది. మనల్ని కదిలిస్తుంది.

అమెరికాలో ఉన్న మనం సాధారణంగా ఒక 'కడుపులో చల్లకదలని' జీవితానికి అలవాటు పడిపోయి (ఏదో ఒక పెద్ద తుఫాను లాంటి సంక్షోభం మనల్ని కుదిపేస్తే తప్ప) ఇతరుల గురించి, అణగారిన ప్రజల గురించి, హక్కుల్ని కోల్పోయిన వాళ్ళను గురించి ఆలోచించడం మానేస్తాం. ఆలోచించినా ఒక కంటి తుడుపుగానో ఒక మాటవరసగానో, అప్పుడప్పుడు అరకొర మాటల్ని కొన్ని మనం తరచూ కలిసే సందర్భాలలో మాట్లాడేసి తర్వాత మన రొటీనులో మునిగిపోతాము. కాని ఇందిరగారు అట్లా కాదు ఒక గొప్పవేదన, angst దుఃఖంతో బ్రతికిందావిడ. బతికినంత కాలం బహుశ ఒక కనబడని, ఒక కదిలించే వ్యథతో బతికిందేమో అన్నట్టుగా కవిత్వం రాసింది. 'తనకూ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం' అట్లాంటి అంతర్మథనం, యుద్ధం, ఘర్షణ ఇందిరగారు చేసారు. అనుక్షణం తపనతో మథనపడ్డట్టు కనిపిస్తారామె కవిత్వం చదివితే! ఒక గొప్ప ఆర్తి, వ్యధ ఆమె కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. కదిలించే అంతర్లీన దుఃఖం వినబడుతుంది. కవిత్వం మొత్తం చదివాక మన కను కొలకుల్లో నీరు మనకు తెలియకుండా నిండుతుంది. హృదయం బరువెక్కుతుంది. అయ్యో ఇంత సున్నితత్వం, సృజనాత్మకత ఉన్న కవిని కోల్పోయామా అని దిగులేస్తుంది.

అమెరికాలో ఉండే రచయితలు చాలా అరుదుగా పట్టించుకునే అంశాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీల సమస్యలు(స్త్రీగా చెప్పడం) హేతువాదం, సామాజిక బాధ్యత,అణగారిన వారిపట్ల సానుభూతి మాత్రమే కాదు ఒక బాధ్యతతో కూడిన గౌరవం (పైపై సానుభూతి చాలా మంది ప్రకటించవచ్చు) ,ఇక్కడ మన జీవితాల్లోని డొల్లతనం, పరాయీకరణ, ఒంటరితనం, ఏదో కోల్పోయినతనం-ఇవన్నీ చాలా అరుదుగా ఇక్కడి నుండి వచ్చే రచనల్లో కనబడతాయి. ఈ మధ్యే యీ పరిస్థితి మెరుగయ్యింది. కాని ఇందిరగారు మొదటి నుండి అట్లా ఆలోచించిందనడానికి ఎన్నో దాఖలాలు ఆమె కవిత్వం నిండా కనబడతాయి. ఉదాహరణలిస్తూ పోవచ్చుగానీ తను స్త్రీల జీవితాల గురించిరాసినవి మంచి తార్కాణాలు. అట్లా ఆమె జీవితాంతం ఆలోచించింది అనడానికి ఈ కవితాసంకలనం నిండా కవిత్వం ఒక సాక్ష్యం. ఇక్కడి జీవితానికి అలవాటు పడి, ఆకళింపు చేసుకుని ఇక్కడి వాతావరణాన్ని అద్భుతంగా తన కవిత్వంలో ప్రతిఫలింపచేసింది. చాలా మంచి images వర్ణనలూ ఉన్న కవితలు ఎన్నెన్నో ఉన్నాయీ కవితా సంకలనంలో!

మనం ఇక్కడి ప్రకృతిలో మార్పులు చూసి ఆనందిస్తాము, స్పందిస్తాము. కాని వాటి specificities ప్రత్యేకతలను పెద్దగా పట్టించుకోము. కానీ ఇందిరగారు అట్లా కాకుండావాటిని కవిత్వంలో మంచి images గా మార్చేరు. అందుకే ఆ కవితలు మంచి paintings లాగా హృదయానికి హత్తుకునే పద్ధతిలో గాఢంగా ఉన్నాయి. ఏ కవితైనా నిర్దిష్టత నుండి సార్వజనీనతకి ప్రయాణం చేస్తే మంచి కవిత అవుతుంది. కలకాలం నిలబడుతుంది. అట్లాంటి కవితలు ఈ కవితా సంకలనంలో చాలా వున్నాయి. అందుకు ఇందిరగారికి మనఃపూర్వక నివాళులు. 'ఆశ నా ఆధారరేఖ' అని చెప్పుకున్న ఇందిరగారు ఆ ఆధారరేఖ పైనే తన జీవితాంతము కవిత్వం చెప్పారు. స్పష్టమైన ఆశావాదం (optimism) జీవితం పట్ల ప్రేమ అవ్యాజమైన అనురాగంతో పాటు ప్రకృతిని ఆరాధంచే తత్త్వం - ఇవన్నీ కలగలిసిన కవి ఇందిరగారు. ఆమె చివరగా రాసుకున్న అభిప్రాయాల్లాంటి notes చూసాక, మళ్ళీ మళ్ళీ కళ్ళు చెమర్చాయి. బౌద్ధభిక్షువులు స్వర్గానికి పోవాలంటే పురుషులుగానే ఎందుకు జన్మించాలి, రాముడు సంబూకుణ్ణి ఎందుకు చంపాడు. ఇట్లాంటి notes ఇందిరగారిలో ఉన్న గాఢతనీ, జ్ఞానాన్నీ, లోతైన

ఆలోచనలని మనకి అందిస్తాయి. కొంతమంది రచయితల్లా పుస్తకాలు రాసి పారేసి కొంత ఖ్యాతిని, చదివిపారేసి నలుగురిలో పేరు కావాలని కోరుకున్న వ్యక్తి కాదు. చాలా స్పష్టంగా ఒక rebel తత్త్వం, ఒక తిరుగబడే వ్యక్తిత్వం అనుక్షణం ఇతరులకోసం వ్యధ చెందే మనసు, ఇతరుల కష్టాలని తనవిగా భావించి కళ్ళు చెమర్చే హృదయం, అమెరికన్ తెలుగు జీవితంలోని జడత్వాన్ని, డొల్లతనాన్ని, పరాయీకరణని, పట్టించుకోని తనాన్ని, లేని గొప్పలు డాంబికాలు చెప్పుకుని బతికే hypocracy ని, నటనల్ని, మర్యాదస్తుల ప్రపంచాన్ని, insensitivity ని వ్యతిరేకిస్తూ పూర్తిగా భిన్నంగా సాగిన సాహిత్య వ్యక్తిత్వం ఇందిరగారిది. మన మధ్య prosaic గా ఉన్నడొల్లతనపు నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టిన poetry ఇందిరగారిది.

ఇందిరగారు మన మధ్యన లేనందుకు హృదయం బరువెక్కి, కళ్ళు చెమర్చినా ఆమె మనకింత మంచి కవిత్వాన్ని మిగిల్చి వెళ్ళినందుకు ఆనందంగా ఉంది. ఇందిరగారు నిస్సందేహంగా చిరంజీవి. మన మధ్య ఆమె, ఆమె ఆశ ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటాయి.

---

*Contd from page… 95*

**తీరిక**

నువ్వేమీ దీనిగురించి అనవసరంగా ఆలోచించకు" అంది నవ్వు ఆపుకుంటూ మెల్లిగా. ఇంకొంచెంసేపు అతనితో మాట్లాడి ఫోను పెట్టేసిన తర్వాత అతని మాటలు గుర్తొచ్చాయి సమయకి. ఆ తర్వాత ఉదయం నుండి తన దినచర్య గుర్తొచ్చింది. ప్రతీవాళ్ళు మాటిమాటికీ తనకి పనేమీ లేదని, బోలేడంత తీరికని గుర్తుచేసేవాళ్ళే! కాని వాస్తవం ఆలోచిస్తే తనకి ఒక్క క్షణం తీరికకూడా లేదు సరికదా, అసలు ఊపిరి పీల్చుకోవటానికి కూడా సమయం లేదు. ఇంక కోర్సులలో చేరటానికి టైము ఎక్కడ వుంటుంది? ఇలా ఆలోచిస్తుంటే ఎందుకో, సమయకి మళ్ళీ ఇంకోసారి పెద్దగా నవ్వొచ్చింది. ఆ రాత్రి నిద్రలో కూడా సమయ అప్పుడప్పుడు నవ్వుకుంటూనే వుంది.

*******


# Middlesex Community Medical Care

Board Certified in Internal Medicine

**Dr. Geeta Yalamanchi, MD**



530 Union Avenue, Suite #2
Middlesex, NJ 08846

(732) 667-3288
www.mcmcare.com

Committed To Excellence In Patient Care

* ALL MAJOR INSURANCES ACCEPTED *ACCEPTING NEW PATIENTS NOW